

# నిర్ణయం

-ఎం. నాగలక్ష్మి

''నాన్నా! రమేష్ అప్పుడే ఫీజ్ కట్టేశాడు. నాకు కూడా డ్రాఫ్ట్ తీసియ్యి. నేను కూడా కట్టేసి వస్తాను'' సందీప్ అన్నాడు.

వాడి ఫ్రెండ్ రమేష్ నాలుగు నెలల కంప్యూటర్ కోర్స్‌లో చేరుతున్నాడు. ఫీజు పది వేలు. సందీప్‌కి కూడా ఆ కోర్సులో చేరాలని ఉంది. కానీ నేనే సందీప్‌కి ఈ కోర్స్ అవసరమా? అని ఆలోచిస్తున్నాను. సందీప్ నా కొడుకని చెప్పుకోవడం కాదుగానీ చాలా బ్రిలియంట్. క్లాస్‌లో ఎప్పుడూ ఫస్టే. వాళ్ళ టీచర్సేమిటి నా ఫ్రెండ్సేమిటి అందరూ సందీప్‌ని తెగ మెచ్చుకుంటారు. వాడి తెలివితేటలు చూశాక నేను తరచూ ఓ కలకనడం మొదలుపెట్టాను. సందీప్ గొప్ప డాక్టరై తెల్లకోటు వేసుకుని సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్లో చకచకా ఆపరేషన్లు చేస్తున్నట్టూ, అందరూ వాడికాళ్ళకి మొక్కి 'మీరు మా పాలిట దేవుడు' అంటున్నట్టు. డాక్టర్‌కి ఇలాంటి కంప్యూటర్ కోర్సులు అక్కరలేదని నా అభిప్రాయం.

''చూడు సందీప్ నేను నిన్ను ఎం.బి.బి.ఎస్ చదివించాలనుకుంటున్నాను. దానికి ఈ కోర్స్ అంత అవసరం కాదు. మెడికల్ ఎంట్రెన్స్‌కి పనికి వచ్చేదేదయినా చదువు'' అన్నాను.

''నువ్వేమనుకుంటున్నావో నాకు తెలియదు. నేను మాత్రం ఇంజనీరింగ్ చదువుతాను. అదీ కంప్యూటర్ ఇంజనీరింగ్'' సందీప్ దృఢంగా అన్నాడు. అన్నం తింటున్న నాకు పొలమారింది. గబగబా గ్లాసెడు మంచినీళ్ళు తాగాను. వారంనుంచీ సందీప్ పెడుతున్న పేచీ అంతా ఇంతా కాదు. పదో తరగతి పరీక్షలు అయి పట్టుమని పది రోజులు కాలేదు నస మొదలు. ఒకటి కాదు రెండు హిరణ్యాక్ష వరాలు అడుగుతున్నాడు. కంప్యూటర్ కోర్సులో చేర్చాలి. అర్జెంట్‌గా ఇంట్లో ఓ కొత్త మోడల్ కంప్యూటర్ తెచ్చిపెట్టాలి. ''చూడు సందీప్, రమేష్, కిరణ్ చదువుతున్నారని, వాళ్ళూ వీళ్ళూ నేర్చుకుంటున్నారని ఆలోచించకు. నీకు సైన్స్‌లో మంచి మార్కులు వస్తున్నాయి. మెడిసిన్ చదివితే బావుంటుంది'' నా కల కరిగిపోతుందేమో అన్న భయం పట్టుకుంది నాకు.

''నాకు లెక్కల్లో ఇంకా మంచి మార్కులు వస్తున్నాయి నాన్నా. నేను బయాలజీ గ్రూప్ తీసుకోను'' సందీప్ కుండబద్ధలు కొట్టినట్టు అన్నాడు. నా కలలమీద కుండెడు నీళ్ళు పడి చెల్లాచెదురై పోతున్నట్టు అన్పించింది. ''తాతయ్యా నాన్నకి నువ్వు చెప్పు నన్ను కంప్యూటర్ కోర్సులో చేర్చమని'' సందీప్ అక్కడే ఉన్న వెంకట్రామయ్య గారి వైపు సపోర్ట్‌కోసం చూశాడు.

''చూడరా నాన్నా. డాక్టరైతే ఎంత బావుంటుందో ఆలోచించు. అందరికీ సహాయం చేసినట్టు ఉంటుంది ... ఇటు సమాజ సేవచేసినట్టూ ఉంటుంది. సంఘంలో డాక్టర్ అంటే ఎంతో గౌరవం .. బోలెడు డబ్బూ'' నేను కన్విన్స్ చెయ్యబోయాను.


''మెడిసిన్ బోర్ నాన్నా! ఆపరేషన్ థియేటర్లలో ఉండే కత్తులు - కటార్ల కంటే నాకు కంప్యూటర్లంటేనే ఇష్టం'' సందీప్ మొండిగా అన్నాడు.

బిల్‌గేట్స్ ప్రభావం పిల్లలమీద ఎంత ఉందో అర్థమయింది.

''పదో తరగతి రిజల్ట్ వచ్చాక ఏ గ్రూప్‌లో చేరాలి అన్నది తేలిగ్గా ఆలోచించవచ్చు. ప్రస్తుతం వాణ్ణి ఆ కంప్యూటర్ కోర్స్‌లో చేర్చరాదుట్రా'' నాన్న గారు నాకు సలహా ఇచ్చారు.

''గబగబా చేర్చెయ్యడానికి పది వేలు ఫీజు'' నేను లోలోపల గొణుక్కున్నాను.

''చూడు సందీప్! చిన్నప్పుడు నేను కూడా నీలాగే వయొలిన్ నేర్చుకుంటాను, చదువుకోను అని కొన్నాళ్ళు చాలా గొడవ చేశాను. అప్పుడు తాతయ్య సంగీతం కంటే చదువు ముఖ్యం అని మందలించి చదువుమీద శ్రద్ధ చూపించమని సరైన దార్లో పడేశారు. అందుకే ఇవాళ ఇలా బ్యాంక్‌లో ఆఫీసర్‌గా ఇంత మంచి ఉద్యోగంలో ఉన్నాను. లేకపోతే ఫిడేల్ డబ్బా పట్టుకుని నాలుగు ట్యూషన్లు చెప్పుకుంటూ బతికేవాడిని.''



డిజిటల్ గ్రాఫిక్స్: భాస్కర్

సందీప్ తాతయ్య వంక 'అవునా?' అన్నట్టు చూశాడు. ఔన న్నట్టు నాన్నగారు తలాడించారు.

''నాన్నా, తాతయ్య నిన్నెలా దార్లో పెట్టారో నాకనవసరం. నేను మాత్రం సరైన దార్లోనే ఉన్నాను. మీరు కంప్యూటర్ కోర్సులో చేర్పించినా, చేర్పించకపోయినా నేను మాత్రం ఇంజనీరింగే చదువుతాను'' సందీప్ కోపంగా అక్కడినించి లేచిపోయాడు. ఈకాలం పిల్లలు మొండివాళ్ళు. లోలోపల గొణుక్కున్నాను.

☆ ☆ ☆

సాయంత్రం ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

''ఇంట్లో ఎవరూ లేరా? ఇల్లింత నిశ్శబ్దంగా ఉంది'' రేవతి చేతిలోంచి కాఫీ తీసుకుంటూ అడిగాను.

''ప్రియ, రఘు పక్క వాళ్ళింట్లో కేరమ్స్ ఆడుకుంటున్నారు. అత్తయ్యగారు ఫలహారం చేసి పడుకున్నారు. మావయ్య గారు బయటికి వెళ్ళారు. గుడికేమైనా వెళ్ళారేమో! సందీప్ వారం నుంచీ రమేష్ వాళ్ళింట్లోనే ఉంటున్నాడు. వాళ్ళు కంప్యూటర్ కొన్నారు కదా. అన్నట్టు శర్మగారు మన సందీప్‌ని ఎంతలా మెచ్చుకున్నారో? కంప్యూటర్స్ గురించి వీడికంతా తెలుసుట'' రేవతి అంది.

''స్కూల్లో ఆరో తరగతి నుంచీ కంప్యూటర్స్ నేర్పిస్తున్నారుగా'' కాఫీ కప్పు కిందపెడుతూ అన్నాను.


''ఈ రోజుల్లో అందరూ పిల్లల్ని కంప్యూటర్ ఇంజనీర్స్ చేసెయ్యాలని అనుకుంటుంటే మీరు మాత్రం 'డాక్టర్ ... డాక్టర్' అంటున్నారు. వాడికేమో కంప్యూటర్ పిచ్చి. ఆ కోర్సులో ఏదో చేర్పించకూడదూ. వాడెంత చిన్నబుచ్చుకుంటున్నాడో?'' రేవతి నాకు నచ్చచెప్పే పద్ధతిలో అంది.

''చూద్దాంలే ... ఎల్లుండి సోమవారం కదా క్లాస్ మొదలు'' కొంచెం సేపు పేపర్ చూసి, టీవీ పెట్టాను. ఎనిమిదయింది. పిల్లలు భోజనాలు కానిచ్చి పడుకున్నారు.

తెలుగు న్యూస్ అయినా నాన్న రాలేదు. టైము తొమ్మిదిన్నర దాటింది.

''మావయ్య గారు అప్పుడప్పుడు గుళ్ళోనో, కమ్యూనిటీ





హాల్లోనో ఏదైనా ప్రోగ్రాం ఉంటే అలాగే లేటుగా వస్తారు. మావయ్య గారెప్పుడు వస్తారో మీరు భోజనం చేసెయ్యరాదూ'' రేవతి అంది.

నాన్న ఎలాగూ ఫలహారమే తినేది. అందుకని నేనూ రేవతీ భోం చేసి మళ్ళీ టీ.వి ముందు కూర్చున్నాం. డిటెక్టివ్ సీరియల్ ఏదో వస్తోంది. ఇంతల్లో ఇంటి ముందు కారు ఆగింది. అందులోంచి నాన్నగారు, నాన్నగారితో ఇంకెవరో...

రేవతి లేచి లోపలికి వెళ్ళింది.

''ఒరేయ్ చక్రీ... ఇతన్ని చూడు... ఎవరో గుర్తు పట్టగలరా...'' నాన్న తనతో వచ్చిన అతన్ని చూపిస్తూ అన్నారు. అతను నా వయస్సు వాడే. నన్ను చూసి నవ్వుతున్నాడు. కొంచెం సేపు పరీక్షగా చూశాను అతనివైపు. తెలిసిన వాడిలాగే ఉన్నాడు. గుర్తు రావటం లేదు. హఠాత్తుగా, అప్రయత్నంగా నా పెదవులు 'గోపాలం' అని పలికాయి.

''అవున్రా, మన గోపాలమే పెద్ద విద్వాంసుడై పోయాడు. ఇవాళ కమ్యూనిటీ హాల్లో తనదే కచ్చేరీ. ఎంత గొప్పగా వాయించాడనుకున్నావు. ఆఖరుదాకా ఉండి మన ఇంటికి పిల్చుకొచ్చాను'' నాన్న ఫలహారం తినడంకోసం లోపలికి వెళ్ళిపోయారు. నేనూ, గోపాలం మాటల ప్రవాహంలో పడిపోయాం. ఎన్నో ఏళ్ళ తర్వాత కల్సుకున్న ప్రాణమిత్రులం. కబుర్లు తెమిలేటట్టు కన్పించలేదు. గోపాలం వాళ్ళావిడ ఖంగారు పడుతుందని లేచాడు ఓ గంట తర్వాత. మర్నాడు సాయంత్రం కారు పంపిస్తాను అందరూ రండి అని ఆహ్వానించి మరీ వెళ్ళాడు.

## ఎవరతను?



'జోష్' చిత్రం తాలూకు పార్టీకి ఎవర్‌గ్రీన్ హీరోయిన్ రేఖ కూడా హాజరైంది. షారూక్ అంటే ఏదో కాస్త నచ్చినట్లే ఉంది. బాగానే మాట్లాడింది అతనితో. షారూక్ మాత్రం 'మంచి బాలుడు' టైపులో బుద్ధిగా ఆమె చెప్పేదంతా విన్నాడు. తనంటే ఆమెకేదో 'ఇదై' మాట్లాడుతోందనుకున్నాడో ఏమో? అంతా అయ్యాక ''ఇంతకీ అతగాడెక్కడ?'' అని అడిగిందట! ఎవ రతను? మీరే చెప్పుకోండి చూద్దాం.

☆☆☆

గోపాలం, చక్రధర్ ఇద్దరూ నాలుగో తరగతి నుంచి ఆరేళ్ళు కలిసి చదువుకున్నారు. గోపాలం అక్క రమ ఫిడేల్ వాయించినప్పుడల్లా చక్రధర్ అలాగే అక్కడే కూర్చుండిపోయేవాడు. నాగస్వరం వింటున్న పాములా మంత్రముగ్ధుడై కదలకుండా కూర్చునేవాడు. వయొలిన్ అలా ఒళ్ళో పెట్టుకుని వాయించాలనిపించేది. రమక్కనడిగి సరదాగా అప్పుడప్పుడు పట్టుకుని కమాన్ అటూ ఇటూ తిప్పి మురిసిపోయేవాడు. గోపాలం సరదా పడుతున్నాడని వాడిని సంగీతం క్లాసులో చేర్చారు. చక్రధర్ నేను కూడా నేర్చుకుంటానని పేచీ పెట్టి తనూ చేరాడు. ఇద్దరూ ఒకటే వయొలిన్ మీద సాధన చేసేవారు. పక్కప్రక్క ఇళ్ళు కావడంతో క్లాసు కూడా ఒకటే అవడంతో గోపాలం, చక్రధర్ ఇద్దరూ పగలూ, రాత్రీ కట్టకట్టుకుని తిరిగేవారు.

''నాన్నా, నాకు వయొలిన్ కొనిపెట్టు. రోజూ గోపాలం వాయించని టైము చూసి వాయించాల్సి వస్తోంది'' చక్రధర్ తండ్రిని అడిగాడు.

''ఏదో ముచ్చటపడ్డావు కదాని అదీ సాయంత్రం ఆడుకునే టైము కదా అని సంగీతం నేర్పిస్తున్నాను. ఫిడేల్, గిడేల్ మాత్రం కొనను'' వెంకట్రామయ్య గారు ఖచ్చితంగా అనేశారు. సంగీతం క్లాసులో ఆరుగురు పిల్లలుండేవారు. అందర్లోకీ గోపాలం చక్రధర్ ఇద్దరూ చాలా బాగా వాయించేవాళ్ళు. సంగీతం మేష్టారు చక్రధర్‌ని ఎంతో మెచ్చుకునేవాడు.

''మీ అబ్బాయి చేతుల్లో వాణి వసిస్తోంది. సంగీత వాద్యంలో పెద్ద పండితుడవుతాడు. ఏం రాగమో... ఏం స్వరాలో టకటకా ఇట్టే చెప్పేస్తాడు. మీ వాడికి నాదం దైవ ప్రసాదంలా అనాయాసంగా వస్తోంది. గోపాలం బాగా వాయిస్తాడు కానీ వాడు కష్టపడి మాధుర్యాన్ని పలికిస్తాడు.'' సంగీతం మేష్టారు వెంకట్రామయ్యగారు కన్పించినప్పుడల్లా పదే పదే అనేవాడు. చక్రధర్ వయొలిన్ ముట్టుకుంటే చాలు మైమరచి పోయేవాడు. అలా ఎంతసేపైనా విసుగూ, విరామం లేకుండా వాయిస్తూ కూర్చునేవాడు. వయొలిన్ తీగలమీద చేతివేళ్ళ లయలకి బద్ధంగా కమాన్ నాట్యం చేసేది. రెండేళ్ళు గడిచాయి.

''మీ వాడికో మంచి ఫిడేల్ కొనివ్వండి. కీర్తనలు వాయిస్తున్నారు. సొంతంగా ఫిడేల్ ఉంటే వాడికి ఎక్కువ సాధన చెయ్యడానికి వీలవుతుంది'' మేష్టారు చక్రధర్ ఇంటికి వచ్చి వెంకట్రామయ్య గారితో అన్నారు.

మేష్టారు చెప్పారు కాబట్టి ఈసారి తనకి ఫిడేల్ వస్తుందని చక్రధర్ మురిసిపోయాడు కానీ తండ్రి మాటలు అశనిపాతాలయ్యాయి.

''మా వాడిని ఈనెల నుంచీ క్లాస్ మాన్పించాలనుకుంటున్నాను. పదో తరగతికి వచ్చాడు. కాస్త శ్రద్ధగా చదివితే ఇంజనీరింగ్ లోనో, మెడిసిన్‌లోనో సీటు వస్తుంది. సంగీతం కంటే చదువు ముఖ్యం కదా మగ పిల్లవాడికి'' వెంకట్రామయ్య గారి మాటలకి మేష్టారు ఏమనగలరు? చక్రధర్ సంగీతం మాననని ఏడ్చి గోల చేశాడు. కొన్నాళ్ళు గోపాలం క్లాస్‌కి వెళ్తుంటే అలా చూస్తూ



ఉండేవాడు. ''నేను సంగీతమే నేర్చుకుంటాను'' అని పేచీ పెట్టే ధైర్యం లేకపోయింది. టెన్త్ పరీక్షలకి ప్రిపేర్ అవసాగాడు. కమాన్ పట్టుకుంటే ఎన్ని గంటలైనా నెప్పి పెట్టని చేతులు కలం పట్టుకుని లెక్కలు చేస్తోంటే నెప్పి పుట్టేవి. గోపాలం సాధన చేస్తోంటే మనస్సంతా అటే వుండేది. ఏడాది పొడగునా పుస్తకాల ముందు కూర్చుని చదివినా చక్రధర్ పాసయ్యాడు తప్ప సైన్స్ గ్రూప్ రాలేదు. గోపాలం పరీక్ష పోయింది. వెంకట్రామయ్య గారికి ట్రాన్స్ఫర్ కావడంతో సంగీతం పూర్తిగా మరుగునపడింది. మెల్లిగా బికామ్ పాసై బ్యాంక్ పరీక్షలకి కట్టి ఈ స్థితిని చేరుకున్నాడు చక్రధర్.

☆☆☆

మర్నాటి సాయంత్రం గోపాలం ఇంటికి వెళ్ళాం. సాదరంగా ఆహ్వానించాడు. ఇల్లు పెద్దదే. చాలా బావుంది. భార్య శ్రీదేవిని అందర్నీ పేరు పేరునా పరిచయం చేశాడు గోపాలం. ఇద్దరమ్మాయిలు ముచ్చటగా వున్నారు. రెండు గంటలు రెండు నిమిషాల్లా గడిచిపోయాయి.

పెద్ద వాళ్ళు అంటూ అమ్మకీ, నాన్నకీ బట్టలు పెట్టాడు. పిల్లల కోసం అంటూ పళ్ళూ, స్వీట్లూ ఇచ్చాడు. రాత్రంతా ఏవో ఆలోచనలు, నిద్ర సమంగా పట్టక సతమతమయ్యారు. ఏదో వెలితి ... గోపాలం తనకన్నా ఆర్థికంగా, సమాజంలో పేరు ప్రతిష్టలతో ఎక్కువ ఎత్తులో ఉన్నాడని కుళ్ళు లేదు నా ఆలోచనల్లో... కానీ ... ఏదో వెలితి ... గోపాలం లాగా తనూ వయొలిన్ నేర్చుకోవడం మానకుండా ఉంటే ఇంత పెద్ద విద్వాంసుడయ్యేవాడా? ... నిట్టూర్చాను ... ఎవరికెంత ప్రాప్తమో అంతే ... గోపాలం కూడా పదేళ్ళు ట్యూషన్స్ చెప్పుకుంటూ చిన్న - చిన్న కచేరీలు చేస్తూ చాలా ఇబ్బంది పడ్డాడట ... తర్వాత ... తర్వాత ... హఠాత్తుగా ఎదిగిపోయాడు. రేడియో ... టీవీ ప్రోగ్రాంలు .. పెద్ద ... పెద్ద కచ్చేరీలు రెండు - మూడు ఫారిన్ కంట్రీస్‌లో కూడా పాడి వచ్చాడు... ఆర్థికంగా నా పరిస్థితీ బాగానే ఉంది కానీ ... కళాకారుడికి సంఘంలో ఉన్న ప్రత్యేకమైన గుర్తింపూ, గౌరవం ఎంత పెద్ద ఉద్యోగస్తుడికైనా రావు కదా ... ఆలోచన్లతో సతమతమవుతున్న నన్ను నిద్రాదేవి ఒడి చేర్చుకుంది.

''మీ వాడి చేతిలో వాణి వసిస్తోంది'' సంగీతం మేష్టారి మాటలు వెంకట్రామయ్యగారి చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆయన ఆలోచనలు పరిపరి విధాల పరుగులెడుతున్నాయి. పెద్ద వాళ్ళు చిన్న పిల్లల్ని సరైన దార్లో నడిపిస్తున్నామనుకుంటూ ఒక్కోసారి తప్పు దారిలో నడిపిస్తారేమో! చక్రధర్‌లో జన్మతః వచ్చిన ప్రతిభకి తను సమాధి కట్టాడు. గోపాలం గొప్ప వాడయ్యాడన్న చెడు తలంపు లేదు ఆయనలో. కొడుకు ఉన్నతిని అనాలోచితంగా అడ్డుకున్నానన్న భావం తప్ప ... పెద్ద వాళ్ళు తాము సరైన నిర్ణయం తీసుకుంటామనుకుంటారు ... కానీ ఒక్కోసారి అది ఎంతో పెద్ద తప్పుడు నిర్ణయం అవుతుంది. ఎంతో సేపటికి కానీ ఆయనను నిద్రాదేవి వరించలేదు.

☆☆☆

సందీప్ రోజూలాగా గలగలా మాట్లాడకుండా మవునంగా భోం చేస్తున్నాడు. వాడి అలక తెలిసి నవ్వుకున్నాను. ఈ రోజుల్లో పిల్లలకి తనతరం వాళ్ళ కన్నా బాగానే తెలుసు వాళ్ళకేం కావాలో? వాళ్ళని బలవంతంగా దారి మళ్ళిస్తే ఆ దారి అయోమయంగా తయారవుతుంది. తన కల కోసం సందీప్ డాక్టర్ కావాలనుకోవడం ఎంత మూర్ఖత్వమో అర్థమవుతోంది ... సందీప్ తను కోరుకున్నట్టు డాక్టర్ కాడు .. వాడు కోరుకున్నట్టు ఇంజనీర్ అవుతాడు ... కంప్యూటర్ ఇంజనీర్. మధ్యాహ్నం లంచ్‌లో వచ్చేసి వీడిని సర్‌ప్రైజ్ చెయ్యాలి. కంప్యూటర్ క్లాస్ నాలుగ్గంటలకి కదా? మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటికి వచ్చేశాను. సందీప్‌ని సర్‌ప్రైజ్ చెయ్యాలనుకున్న నాకు సర్‌ప్రైజ్ ఎదురయింది. ఇల్లంతా హడావిడి ... సందీప్ గదిలో టేబుల్ మీద కంప్యూటర్ ఇన్‌స్టాల్ అవుతోంది.

''నాన్నా తాతయ్య నన్ను కంప్యూటర్ క్లాస్‌లో చేర్చారు. ఇదిగో కంప్యూటర్ కూడా కొనిపెట్టారు'' సందీప్ ఉత్సాహంగా అంటున్నాడు. వాడి మొహం వెయ్యి ఓల్టుల బల్బులా వెలిగిపోతోంది.

''నాన్నా ... ఆ డబ్బు మీరూ ... అమ్మా తీర్థయాత్రలకని దాచుకున్నారు దాన్ని ఇలా ...'' నాన్న నన్ను మధ్యలోనే అడ్డుకున్నారు.

''తీర్థయాత్రలదేముంది ఎప్పుడైనా చేయొచ్చు... నువ్వు నాలాగే తప్పుడు నిర్ణయం తీసుకుంటున్నావనిపించింది.... అందుకే ... సందీప్‌కి ఇది నా కానుక'' నాన్న కళ్ళు చెమ్మగిల్లాయి ఎందుకో!

## హే గోవిందా!

'హేరామ్' చిత్రంలో డీ-గ్లామరైజ్‌డ్ పాత్ర వేసిన రాణీ ఆ తరువాత విడుదలైన బాదల్, హద్ కర్ ఆప్నే- చిత్రాల్లో గ్లామర్ పాత్రలే వేసింది. 'హేరామ్' కోసం కొద్దిగా లావైన రాణీ తిరిగి తన పూర్వ నాజూకుతనం చూపే ప్రయత్నంలో ఉంది. మరి గోవిందాతో కనెక్షన్ ఉందో లేదో తెలియడం లేదు.

